క్లుప్తంగా

వరి పంట తెగుళ్లపై అప్రమత్తం



దూసిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ మోహన్‌రావు

ఆమదాలవలస రూరల్: వాతావరణంలో మార్పుల వల్ల వరి పంటలో తెగుళ్లు వస్తున్నాయని, వాటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ మెట్ట మోహన్‌రావు సూచించారు. మండలంలోని దూసి, నిమ్మతొర్లాడ, కొరపాం ,జీకేవలస గ్రామాల్లోని పంట పొలాలను బుధవారం పరిశీలించారు. వరిలో పాముపొడ, ఆకుముడత, తెల్లదోమ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వ్యవసాయ అధికారులు సూచించిన పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



బోరు తవ్వుతున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడానికి ప్రభుత్వం రూ.37 లక్షలు మంజూరు చేసింది. అందులో భాగంగానే పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ జనపరెడ్డి గాయత్రి తెలిపారు. బుధవారం బోర్‌వెల్‌ను తవ్వించారు. దీని ద్వారా గ్రామంలోని ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నట్లు తెలిపారు.వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్న బాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా విద్యుత్ లైన్లు వేస్తున్న నేపథ్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యా సామర్థ్యాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రమౌళి

సరుబుజ్జిలి: విద్యా సామర్థ్యాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎల్ఎన్‌పేట ఎంఈఓ ఎం.చంద్రమౌళి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. పాఠశాల నాయకత్వం, పాఠశాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బొత్స వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న క్షేత్రసహాయకులు

మెళియాపుట్టి: గత 16 ఏళ్లుగా ఉపాధి హామీలో పనులు చేస్తూ.. అరకొర జీతాలతో అనేక ఇబ్బందులుపడుతూ కుటుంబాలను అతికష్టం పై నెట్టుకొస్తున్నామని మెళియాపుట్టి మండలానికి చెందిన పలువురు క్షేత్రసహాయక సంఘం సభ్యులు అన్నారు. ఏపీఓ రవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. క్షేత్రసహాకుడు లొడగల శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రసహాయకుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంఈఓ రమణ

సారవకోట: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంఈఓ ఎం.వి.రమణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఇస్తున్న శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

● క్రీడాకారులకు అభినందన



ఎల్.ఎన్.పేట: త్రోబాల్ పోటీలకు ఎంపికైన రావిచెంద్రి విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలస, రావిచెంద్రి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పాలక రామారావు, పీడీలు డి.యశోద, కె.లక్ష్మణరావు తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన త్రోబాల్ పోటీల్లో రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అండర్-14 విభాగంలో బాలికల్లో టి భవాని, బాలురలో ఎస్ వంశీ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బేస్ బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో బి.సుదీప్ష (10వ తరగతి), అండర్-14 విభాగంలో కె.తనూజ (8వ తరగతి), బి.హారిక (8వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు.

తైక్వాండో పోటీలకు నరసన్నపేట విద్యార్థి ఎంపిక..
నరసన్నపేట: స్థానిక శర్వాణీ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న పోటీలకు ఎంపికైనట్లు శర్వాణి విద్యా సంస్థల డైరెక్టర్ సాయి రాణి తెలిపారు. అండర్ 14 విభాగంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో హర్షవర్ధన్ మంచి ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి క్రీడా విభాగం అధికారులు ఎంపిక చేసినట్లు తెలిపారు. హర్షవర్ధన్‌కు శర్వాణీ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు అంధవరపు సూరిబాబు, తదితరులు అభినందించారు.

జగనన్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



కొత్తూరులో పాదయాత్ర చేస్తున్న లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. ఈ నాలుగున్నరేళ్లల్లో రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసీవరప్రసాదరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా పార్టీలకు అతీతంగా లక్షలాది పేద కుటుంబాలు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ విప్లవం తీసుకువచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో 175 నియోజవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. కొత్తూరు నుంచి ప్రారంభమైన పాదయాత్ర మహార్తాపురం, కుంటిభద్ర కాలనీ, వసప, నివగాం, మాతల, వీఎన్‌పురం, మాకవరం, కుద్దిగాం, పొనుటూరు వరకు సాగింది. పాదయాత్ర పాతపట్నం నియోజవర్గంలో ఏడు రోజులపాటు నిర్వహిస్తునట్లు తుసీవరప్రసాదరావు తెలిపారు. మొదటిరోజు పాదయాత్ర 15 కిలోమీటర్లు మేర సాగింది. పార్టీ జిల్లా కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రేగేటి కన్నయ్య స్వామి, మాజీ అధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు, పీఎంపీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పడాల వెంకటకృష్ణ, కొయిలాపు సంజీవరావు, నాగేశ్వర రావు, జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

బూర్జ: మండలంలోని గుత్తావల్లి గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్-ఆమదాలవలస, శ్రీకాకుళం మెడికవర్ హాస్పటిల్ సౌజన్యంతో గురువారం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆ గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవకాశాన్ని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

పరామర్శ..



రాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ రెడ్డి అపర్ణ భర్త రెడ్డి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఏపీ రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం ఆర్.ఎల్.పురం గ్రామానికి వెళ్లి రాజు కుటుంబాన్ని పరామర్శించారు. జి.సంజీవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు అందజేస్తున్న వసంతరావు

పొందూరు: రోటరీ అంతర్జాతీయ సంస్థ సహకారంతో ప్రభావతి జాగృతి ట్రస్టు వ్యవస్థాపకుడు సప్పటి వసంతరావు ముగ్గురు మహిళలకు కుట్టు మిషన్లను బుధవారం అందజేశారు. స్థానిక ప్రభావతి నిలయంలో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా మెరుగుపడేందుకు కుట్టు మిషన్లు దోహదపడతాయన్నారు. హరికుమారి, అన్నపూర్ణ, లబ్ధిదారులు నాగమణి, గోరు కాంత, పాతిన ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణాల మంజూరు

ఆమదాలవలస రూరల్: పంచసూత్రాలు పాటిస్తూ.. ఏ గ్రేడులో ఉన్న గ్రామసంఘాలలోని మహిళలకు గ్రామ సంఘం కార్యాలయంలోనే డాక్యుమెంటేషన్ పూర్తిచేసి రుణాలు మంజూరు చేస్తామని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో పొన్నాంపేట గ్రామంలో సంఘం కార్యాలయంలో బుధవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. అర్హత గల మహిళా సంఘాలకు వారి పొదుపు ఖాతా నుంచి సభ్యుల అవసరం మేరకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతు మహిళా ఉత్పత్తి సంఘాలకు రూ.ఐదు లక్షల రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. వీఓఏ గాయిత్రి, మహిళలు పాల్గొన్నారు.

కుల గణన నిర్ణయంపై హర్షం



మాట్లాడుతున్న రాజాపు హైమావతి

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడం ఎంతో అభినందనీయమని, దీంతో అన్ని కులాలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి అన్నారు. కులగణన నిర్వహణపై గతంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం అసెంబ్లీకి సమర్పించారన్నారు. కులగణన చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల సర్వాత్రా హర్షం వ్యక్తం అవుతుందన్నారు. నరసన్నపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె స్థానిక నాయకులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. వందేళ్ల తరువాత రాష్ట్రంలో కులగణన చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నిర్ణయం సాహసోపేతమైనదని అభిప్రాయపడ్డారు. సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆరోగ్య, విద్యా ఫలాలు సక్రమంగా అందించేందుకు కుల గణన దోహదపడుతుందన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పొందర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజాపు అప్పన్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



ఎల్.ఎన్.పేట: పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి అని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు అన్నారు. మండలంలోని చొర్లంగి గ్రామ సచివాలయంలోని చెత్తసేకరణ కేంద్రం ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బుధవారం కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, ఈఓపీఆర్డీ ఐ.పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు కింతలి చిరంజీవి, పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ దూత్ సేవలు అమోఘం
బూర్జ: స్వచ్ఛ దూత్‌ల సేవలు అమోఘమని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని చీడివలస గ్రామ సచివాలయంలో బుధవారం ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో 16 మంది స్వచ్ఛ దూత్‌లను సన్మానించారు. వారితో కలిసి కాఫీ తాగారు. ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, చీడివలస సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి, కొల్లివలస సర్పంచ్ జీడి వేణు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం.. శ్రేయస్కరం



మెళియాపుట్టి: చిన్నారులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వజ్రమ్మ



సరుబుజ్జిలి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మెళియాపుట్టి: పోషక ఆహారం శ్రేయస్కరమని సిరియాఖండి సర్పంచ్ తాడేల వజ్రమమ్మ అన్నారు. బుధవారం సిరియాఖండి స్త్రీశిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆహార పదార్థాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం టేక్ హోమ్ కిట్లను అందిస్తుందన్నారు. పిల్లలకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడేల రామరాజు, సూపర్ వైజర్ ప్రియంవద, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోండి..
సరుబుజ్జిలి: ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నాంజలి తెలిపారు. పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా మండలంలోని తురకపేట గ్రామంలో ర్యాలీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆమదాలవలస రూరల్: విద్యార్థులకు పోటీపరీక్షలు నిర్వహించడం వల్ల చదువులో సామర్థ్యం పెరుగుతుందని సత్యసాయి సేవా సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆమదాలవలస జోన్ పరిధిలో గల 13 జూనియర్ కళాశాలల విద్యార్థులకు బుధవారం ఆమదాలవలస పట్టణంలోని జీజే కాలేజీలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 349 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సమితి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రతీ ఏడాది సమితి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి



సమస్యలు వివరిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ కృష్ణారెడ్డిని విజయవాడలో ఆయన కార్యాలయంలో బుధవారం పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య కోరారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచనల మేరకు పనుల జాప్యానికి కారణమైన టెండరింగ్ విధానంపై పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి వినతిపత్రం రూపంలో అందించారు. ఒకే టెండరింగ్ వల్ల క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలించక గుత్తేదారు కూడా ఇబ్బంది పడాల్సివస్తోందన్నారు. పంచాయతీలు, సచివాలయాల వారిగా పనులకు టెండర్ విధానం చేపట్టడం వల్ల పనులు వేగవంతమవుతాయని వివరించారు. జలుమూరు మండలంలోని 14 పంచాయతీల్లో చేపడుతున్న పనులకు నిధుల అంచనాలకంటే తక్కువగా ఉన్నాయని, నిధులు పెంచి పనులు విస్తరింపజేయాలని విన్నవించారు. అవకాశం ఉన్న మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ కృష్ణారెడ్డి హామీ ఇచ్చారని కృష్ణచైతన్య తెలిపారు.

వినాయక లడ్డూ వేలం



సారవకోట: లడ్డు ప్రసాదంతో భక్తులు



సరుబుజ్జిలి: లడ్డూను దక్కించుకున్న భక్తులు

సారవకోట: మండలంలోని బుడితి, అవలింగి, చీడిపూడి గ్రామాల జంక్షన్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ బుధవారం నిర్వహించిన వేలం పాటలో రూ.33 వేలు పలికింది. గ్రామానికి చెందిన పైడిశెట్టి మురళి, నాగేశ్వరరావు, పంచిరెడ్డి రమణ వేలం పటలో లడ్డూను దక్కించుకున్నారు.

పురుషోత్తపురంలో
సరుబుజ్జిలి: వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో లడ్డూ వేలంపాట బుధవారం నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన పూజారి పురుషోత్తమరావు, రమ్యశ్రీ దంపతులు లడ్డూ ప్రసాదాన్ని రూ.5601 దక్కించుకున్నారు. వీరికి వినాయక యూత్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

రూ.47 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు



బాలాజీనగర్‌లో ఇంటింటికీ కుళాయి పనులను పరిశీలిస్తున్న డీఈఈ మధుసూదనరావు

పాతపట్నం: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 297 జల్ జీవన్ మిషన్ పనులకు రూ.47కోట్లు మంజూరయ్యాయని, ఈ మొత్తంతో తాగునీరు అందించేందుకు ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.మధుసూదనరావు అన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీలోని బాలాజీనగర్-2లో ఇంటింటి కుళాయి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పైపులైన్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పాతపట్నం మండలం సీది గ్రామంలో రూ.3.37 కోట్లతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలతోపాటు తాగునీరు ట్యాంకు పనులు చేపడుతున్నామన్నారు. జేఈ కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సారవకోట మండలంలో గల మాకివలస అంగన్‌వాడీ సహాయ కార్యకర్త(ఆయా) పోస్టు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ హెచ్‌కె కామాక్షి బుధవారం తెలిపారు. టీఎస్పీ ఏరియా పరిధిలోని ఈ అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టును భర్తీ చేసేందుకు ఎస్సీ కేటగిరికి కేటాయించామన్నారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 5వ తేదీలోగా సారవకోట ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..
మెళియాపుట్టి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బందిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పాతపట్నం సీడీపీఓ విమలారాణి బుధవారం తెలిపారు. దీనబంధుపురం, సుందరాడ,శే ఖరాపురం, పొగడవెల్లి, సానిపాలెం కేంద్రాలలో సహాయకుల పోస్టులు, గంగన్నపేటలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఈ నెల 30 తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా పాతపట్నం స్త్రీఅభివృద్ధి సేవా పథకం కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. కనీసం7వ తరగతి పాసై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు మండల స్థాయిలో సెక్టార్ సూపర్ వైజర్, సిబ్బందిని సంప్రదించాలన్నారు.

పాతపట్నం: పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాజెక్టు పీఓ విమలారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం మండలంలోని సింగుపురం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (ఓసీ కెటగిరి), కొనంగిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ-బి) కేటాయించామన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పాతపట్నం విద్యానగర్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం



పొందూరు: పిల్లలవలసలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



నరసన్నపేట: కొత్తవీధి-నాయుడు వీధి వినాయక విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా బుధవారం పలు చోట్ల విగ్రహాలను అనుపోత్సవం నిర్వహించారు. జగన్నాథపురం, బండివీధుల్లో అన్నదానాలు చేపట్టారు. కొత్తవీధి-నాయుడు వీధి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. రెడ్డికిపేట, ఉర్లాం తదితర గ్రామాల్లో విగ్రహాలను నిమజ్జనం చేపట్టారు.

పొందూరు: మండలంలోని పిల్లలవలస గ్రామంలో కళింగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడి నిమజ్జన వేడుకలు చేపట్టారు.

నీమాస్త్రం తయారీపై అవగాహన

కొత్తూరు: నీమాస్త్రం తయారీపై రైతులకు స్థానిక ఏఓ శ్రీనివాసరావు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని ఓంద్రుజోలలో పొలంబడి నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వేప ఆకులు, ఆవు మూత్రం, పేడతో నీమాస్త్రం తయారు చేసే విధానాన్ని వివరించారు. నీమాస్త్రం వరి పంటకు ఏలా వినియోగించాలన్నది తెలియజేశారు. నీమాస్త్రం ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.